క్లుప్తంగా

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



నర్సంపేట : పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. తొలుత దుర్గామాత విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని కోలాటం, బోనాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంచూరి కృష్ణమూర్తి, నాయకులు నామగల్ల కృష్ణమూర్తి, వంగేటి గోవర్ధన్, పబ్బ రమేశ్, వేముల రాజు, బాల విజయ్, రాయపూడి హరికృష్ణ, మాదారపు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన కంది వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, డైరెక్టర్ మహేందర్‌రెడ్డి, సీతఓట చిట్టి రవి సోమవారం పరామర్శించారు. తొలుత వెంకటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, రమేశ్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి..



రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుంట రాజును అతడి నాన్నమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ నీలయ్య, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, మూనావత్ రవి, కుంట రామ్మూర్తి, రంగారెడ్డి, పీరని ప్రవీణ్, నల్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లిలో..

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన మేడిపల్లి రమేశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గ్రామ ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపకుడు సోమవారం పరామర్శించారు. తొలుత రమేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బొమ్మెర కొమ్మాలు, చిలపాక బన్నీ, రాజు, వెంకన్న, సంపత్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన తాళ్ల రాజ్‌కుమార్‌కు అతడితో కలిసి స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు సోమవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. తొలుత రాజ్‌కుమార్‌ను అతడి తండ్రి భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో పరామర్శించారు. భిక్షపతి చిత్రపటానికి నివాళులర్పించారు.

రేపు వినియోగదారుల పరిష్కార వేదిక

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి ట్రాన్స్‌కో సెక్షన్ ఆఫీస్‌లో రేపు (16న) విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఏఈ ప్రత్యూశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిర్నిబావి, దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు హాజరై సమస్యలను వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలను వీలైతే అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

గ్రామసభల్లో అర్హులను ఎంపిక చేయాలి

కొత్తగూడ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని అయిలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో నాయకులు వెంకటయ్య, శ్రీశైలం, బుచ్చిరాములు, లింగన్న, యుగేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీకాతో పశువుల ఆరోగ్య పరిరక్షణ

● పశు వైద్యాధికారి డాక్టర్ మంజీలాల్



చెన్నారావుపేట : పశువులకు గాలికుంటు వ్యాధి, నట్టలు చాలా ప్రమాదకరమైనవి. పశువులను సత్తువ లేకుండా చేసేది గాలికుంటు వ్యాధి. ఇది ఒకసారి సోకితే ఇక ఆ పశువు ఎందుకూ పనికి రాకుండా పోతుంది. పశువులు ఆ వ్యాధి బారిన పడకుండా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ముందు జాగ్రత్తగా టీకా వేయిస్తే నివారించవచ్చు. జిల్లాలో గోజాతి పశువులు 90 వేల 452, గేదె జాతి పశువులు లక్షా 21 వేల 489 వరకు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటన్నింటికీ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మాత్రలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో పంపిణీ చేస్తున్నారు. గాలికుంటు వ్యాధి, నట్టల నివారణ, తదితరాలపై పశు వైద్యాధికారి డాక్టర్ మంజీలాల్ సూచనలు చేశారు. నేటి నుంచి పల్లెల్లో గాలికుంటు నివారణ టీకాలు, నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

గాలికుంటు వ్యాధి సోకే విధానం

చీలిక గిట్టలున్న పశువులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. ఈ వ్యాధి సూక్ష్మమైన ఆఫ్తో వైరస్ వల్ల పశువులకు సోకి గాలి, ఇతర మార్గాల ద్వారా అతివేగంగా పశువులకు వ్యాపించే అంటు వ్యాధి. ఈ వ్యాధి సోకడంతో మరణాల శాతం లేకపోయినా పశువుల్లో ఉత్పాదక శక్తి తగ్గి తీవ్ర ఆర్థికనష్టం వాటిల్లుతుంది. జబ్బుసోకిన పశువుల పాలు తాగి దూడలు మరణించే అవకాశం ఉంది. ఈ వ్యాధి యుక్త వయస్సులో ఉన్న, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న, దేశవాళీ పశువులతో పోలిస్తే సంకరజాతీ పశువుల్లో ఎక్కువ.

వ్యాప్తి ఇలా..

సాధారణంగా వ్యాధి సోకిన పశువులు ఆరోగ్యవంతమైన ఇతర పశువులకు దగ్గరకు ఉండటంతో వ్యాధి వ్యాప్తికి కారణమవుతాయి. అంతేకాకుండా వ్యాధి సోకిన పశువుల నుంచి విడుదలయ్యే అంతస్రావాలు, వసర్జక స్రావాల్లో వైరస్ కలిగి ఉండి వ్యాధికి గురవుతాయి. వ్యాధి లక్షణాలు కనబడే 4 రోజుల ముందు వరకు పాలలో, వీర్యంలోనూ వైరస్ ఉంటుంది. పాల ద్వారా దూడలకు, పాల ట్యాంకుల ద్వారా ఇతర పశువులకు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన పశువులు తినే గడ్డి ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి కలిగించే వైరస్ ఎండిపోయిన పేడలో అయితే 14 రోజులు, చలికాలంలో ఉండే పేడలో 6 నెలలు, మూత్రంలో 39 రోజులు, మట్టిలో ఎండాకాలంలో 3 రోజులు, చలికాలంలో 28 రోజులు బతక కలుగుతుంది.



నోటిలో పుండుతో సొంగ కారుస్తున్న పశువు



పశువు గిట్టల్లో పుండు

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

మండలంలోని ఆవులు, గేదెలకు నేటి (మంగళవారం) నుంచి గాలికుంటు నివారణ టీకాలు, నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ మంజీలాల్ తెలిపారు. నేడు (15న) ఉప్పరపల్లి, జల్లి, ఖాదర్‌పేటలో, 16న కోనాపురం, లింగగిరి, సూర్యాపేట తండా, 17న లింగాపురం, తోపనగడ్డ తండా, గొల్లభామతండా, 18న జీడిగడ్డతండా, కందిగడ్డ తండా, గొల్లపల్లిలో, 19న కాల్‌నాయక్‌తండా, బాపునగర్, జోజిపేటలో, 21న బాల్‌నాయక్‌తండా, శంకరంతండా, పాపయ్యపేటలో, 22న మేగ్యతండా, పత్తినాయక్‌తండా, ధర్మతండా, 23న దుబ్బాతండా, అమృతండా, 24న బురుగుకుంట తండా, బోజెర్వు, 25న అమీనాబాద్, పుల్లయ్య బోడుతండా, 26న జల్లితండా, ఎల్లాయగూడెం, 28న జీడిగడ్డతండా, ఎల్లాయగూడెం, 29న ఔసులతండా, 16 చింతల్‌తండా, 30న బోడ మాణిక్యంతండా, నవంబర్ 1న తిమ్మరాయినిపహాడ్, నవంబర్ 2న అక్కల్‌చెడ, 4న ఈర్యతండా, 5తోపాటు 7 తేదీల్లో చెన్నారావుపేటలో టీకాలు వేయడంతోపాటు నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స

వ్యాధి సోకిన పశువులను వేరు చేసి చికిత్స చేయించాలి. వైరస్ నివారణకు మందులు పని చేయవు. కాబట్టి నోటిలోని పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ నీళ్లతో శుభ్రం చేసి వాటికి బోరోగ్లిజరిన్ యాంటీసెప్టిక్ అయింట్‌మెంట్‌ను పూతగా పూయాలి. కాలిపుండ్లను జింక్ ఆక్సైడ్‌లో రాక్సిన్, హిమాక్స్ వంటి అయింట్‌మెంట్ పూతగా పూయాలి. ఈగలు వాలకుండా వేపనూనె, లినమెంట్ వంటివి వాడాలి. నోటిలోని చిగుర్లు, పుండ్ల మీద పొరలు తగ్గేలా విటమిన్-సీ ఉండే అప్తోకేర్ పౌడర్ వాడాలి. పశువుల గదులను క్రిమిసంహారక మందులతో కాకుండా సోడియం హైడ్రాక్సైడ్, 2 శాతం పార్మాలిన్, 4 శాతం సోడియం కార్బోనేట్ వంటి మందులతో శుభ్రం చేస్తే వైరస్ నశిస్తుంది. బొబ్బల వల్ల మేత మేయని పశువులకు సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందించాలి. వ్యాధి సోకిన పశువుల పాలను దూడలకు తాగించొద్దు.

లక్షణాలు..

వ్యాధి లక్షణాలు జీవాల కన్నా పశువుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 104–106 డిగ్రీల ఫారన్ హీట్ ఉంటుంది. నోటిలో చర్మపు పొరలు, పళ్ల చిగుళ్ల నాలుక, తోక వద్ద లోపలి ప్రాంతంలో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికిపోవడంతో పశువులు ఆ నొప్పి బాధకు మేత తినలేని దుస్థితి నెలకొంటోంది. ఈ స్థితిలో పశువులు నోటి నుంచి నురగకారుస్తూ, ఒగిరిస్తూ ఉంటాయి. గిట్టల మధ్య, గిట్టలపైన వలయంగా ఉండే ప్రాంతంలో బొబ్బలు ఏర్పడి అవి చితికి నొప్పితో నడవలేక కుంటుతుంటాయి. పాలిచ్చే పశువుల చనుమొనలపై కూడా బొబ్బలు ఏర్పడి పొదుగు వాపు కూడా వస్తుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగితే దూడలు మరణించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దుక్కికి ఉపయోగించే పశువులు పనులకు పనికి రావు. చూడి పశువులకు వ్యాధి సోకితే గర్భస్రావాలు సంభవించే ప్రమాదం ఉంది.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఖానాపురం : వ్యవస్థాపకుడు సుబ్బారావు, హెచ్‌ఎం నాయుడు, ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని భానోజీపేట జెడ్పీ సెకండరీ స్కూల్‌లో 2007–08 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆ పాఠశాల ఆవరణలో సోమవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అప్పటి విద్యా కమిటీ చైర్‌పర్సన గోపు మమత, ప్రధానోపాధ్యాయుడు కోడెం ఈశ్వరమూర్తి, ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాగిత యాకయ్య, కుంచారపు రాంరెడ్డి, మహమ్మద్ మస్తాన్, అంకేశ్వరపు కుమారస్వామి, రాపాల అశోక్, సోమయ్య, పూర్వవిద్యార్థులు రాజేందర్, అలీ, అనిల్, సుమన్, నాగరాజు, అనిల్, రాజు, సందీప్, మధూకర్, భాస్కర్, మానస, నవత, సునీత, కల్పన, రజిత, లావణ్య సలేంద్ర, మమత, దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ గురుకుల విద్యాలయంలో..



నర్సంపేట : సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

ఖానాపురం : మండల కేంద్రంలోని నేతాజీ గురుకుల విద్యాలయంలో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు విద్యాలయ ఆవరణలో కలుసుకుని ఆనంద పారవశ్యం పొందారు. నాటి మధురానుభూతులను జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. కార్యక్రమంలో విద్యాలయ వ్యవస్థాపకుడు సుబ్బారావు, హెచ్‌ఎం నాయుడు, ఉపాధ్యాయులు మోశయ్య, రాములు, విద్యార్థులు రామకృష్ణ, మనోహర్, బాలరాజు, రాజు, శ్రీనివాస్, భరత్, సుమలత, స్వప్న, మల్లికాంబ, అనిత, మంగమ్మ, సరోజన, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న కుమారస్వామి, నాయకులు

నర్సంపేట : ప్రొఫెసర్ జీఎస్.సాయిబాబా మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటని తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి అన్నారు. ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద మహబూబ్‌అలీ అధ్యక్షతన సాయిబాబా చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. ప్రొఫెసర్ సాయిబాబా ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమానికి నాయకత్వం వహించాడని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఆవశ్యకతను సమాజానికి తెలియజేస్తూ ఉద్యమాన్ని ముందుండి నడిపించారని కీర్తించారు. సాయిబాబా స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల బాధ్యులు సమ్మయ్య, కల్లెపల్లి ప్రణయ్‌దీప్, గోవర్ధన్, రాజేందర్, జావిద్, వెంకటేశ్వర్లు, గిరగాని శ్రీనివాస్, కె.కుమారస్వామి, ప్రభాకర్, అక్కపెల్లి రమేశ్, డ్యాగల శ్రీను, పాలక కవిత, లక్ష్మయ్య, సంధాని, కందికొండ కుమార్, ఎర్ర సాయిచంద్, చిన్నపల్లి నర్సింగం, హన్మకొండ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఝాన్సీరెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

రాయపర్తి : పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని తొర్రూర్‌లో షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని ఆ పార్టీ నాయకులు ఆమె నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఝాన్సీరెడ్డి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ అనుబంధ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఊగ మునిత, నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, వల్లపు కుమార్, మచ్చ కుమారస్వామి, సోమిరెడ్డి, రామచంద్రారెడ్డి, బద్దం లక్ష్మీరెడ్డి, గజవెల్లి రామశేఖర్, వశపాక ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ నిబంధనలు పాటించాల్సిందే..



సంగెం : సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్



గీసుకొండ : మాట్లాడుతున్న నాయకులు

● కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రమేశ్

సంగెం : కాంగ్రెస్‌లోని సభ్యులు, నాయకులు అందరూ ప్రొటోకాల్ నిబంధనలు పాటించాల్సిందేనని ఆ పార్టీ అధికార ప్రతినిధి జనగాం రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలకు తావులేదని చెప్పారు. గ్రూపు రాజకీయాలను పోత్సహించడం సరికాదన్నారు. గీసుకొండ మండలంలోని ధర్మారంలో పరకాల ఎమ్మెల్యే ఫొటో లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై వివాదం చోటు చేసుకోవడం దురదుష్టకరమన్నారు. వ్యక్తిగతంగా అభిమానం ఉన్న నాయకులను కలుసుకోవచ్చని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినపుడు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రొటోకాల్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో రేవూరి ఆధ్వర్యంలో ప్రజాసంక్షేమం కోసం పార్టీ నిబంధనలకు కట్టుబడి పని చేయాలని సూచించారు. గ్రూపు రాజకీయాలకు తెరతీసి ప్రతిపక్షాల విమర్శలకు తావు ఇవ్వద్దని కోరారు. సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మెట్టుపల్లి రమేశ్, మడత కేశవులు, నాయకులు పులి సాంబయ్య, ఇండ్ల రవికుమార్, పోతుల ప్రభాకర్, నర్సింహనాయక్, రాజ్‌కుమార్, రాజేశ్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి సురేఖ చిల్లర రాజకీయాలు మానుకోవాలి'

గీసుకొండ : మంత్రి కొండా సురేఖ చిల్లర రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు వీరగోని రాజ్‌కుమార్, కూస రమేశ్, మోహన్, దూల వెంకటేశ్వర్లు, ఆంగోతు కవిత మాట్లాడారు. గీసుకొండలో పార్టీ ముఖ్య నాయకులు, క్రియాశీల కార్యకర్తలు సమావేశమై ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వివాదంలో మంత్రి సురేఖ వ్యవహరించిన తీరును తప్పుపట్టారు. ఎంపీటీసీ నుంచి మంత్రిగా ఎదిగింది గీసుకొండ నాయకులు, కార్యకర్తల బలంతోనే అనే విషయాన్ని మరచిపోవద్దని చెప్పారు. దాడిలో గాయపడిన బీసీ సామాజిక వర్గానికి చెందిన కార్యకర్తను పరామర్శించకపోగా దాడి చేసిన వారి కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. రాస్తారోకో చేయించి, పోలీస్‌స్టేషన్‌లో హల్‌చేసి స్థాయిని దిగజార్చుకున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా హుందాగా వ్యవహరించాలని, గ్రూపు రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డ శివారులో పేకాడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మనుబోతులగడ్డ శివారులో పేకాడుతున్నారనే సమాచారం అందడంతో పోలీసు సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా మనుబోతులగడ్డకు చెందిన గుర్రం సదయ్య, వల్లెపు చంద్రయ్య, బీసు రవి, ఎస్‌కే.జాఫర్‌లను పేకాడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,650 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'మంత్రి కొండా సురేఖ తీరు సరికాదు'

ఆత్మకూరు : గీసుకొండ మండలంలో చోటుచేసుకున్న ఫ్లెక్సీ వివాదంపై మంత్రి కొండా సురేఖ అనుసరించిన తీరు సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గీసుకొండ మండలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఫొటో లేకపోవడంపై ప్రశ్నించిన ఓ కార్యకర్తపై దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారికి మంత్రి కొండా సురేఖ మద్దతు ఇవ్వడం వల్ల కార్యకర్తల మనోధైర్యం దెబ్బతిన్నదని చెప్పారు. ఇప్పటికైనా జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో సమన్వయం ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మంత్రి సురేఖపై ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు సుధాకర్ రెడ్డి, రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'దాడి హేయం'

దామెర : కాంగ్రెస్ పార్టీ నాయకుడిపై దాడిచేయడం హేయమైన చర్య అని ఆపార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గీసుగొండ మండలంలోని ధర్మారంలో దసరా పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. కాగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పిట్టల అనిల్‌పై దాడిచేయం బాధాకరమని అన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, కూనాటి రామకృష్ణారెడ్డి, జన్ను రాంచందర్, జక్కుల రవి, దామెర శంకర్, తదితరులు ఉన్నారు.

'రాజపల్లిని మున్సిపాలిటీలో కలపొద్దు'



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజపల్లిని మున్సిపాలిటీలో కలపొద్దని మాజీ సర్పంచ్ నామాల సత్యనారాయణ, గ్రామస్తులు రవీందర్‌రెడ్డి, సురేశ్ కోరారు. ఈ మేరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యనారాయణతోపాటు రవీందర్‌రెడ్డి, సురేశ్ మాట్లాడారు. రాజపల్లి గ్రామ ప్రజలందరూ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. మునిసిపాలిటీలో విలీనం చేస్తే వ్యవసాయ కూలీలకు ఈజీఎస్ పథకం వర్తించకపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. మునిసిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రామస్తులు సురేశ్, రమేశ్, కుమారస్వామి, కట్టస్వామి, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష సామాజిక ఐక్యత పెంచాలి

● 17 నుంచి ఓంకార్ వర్ధంతి కార్యక్రమాలు
● ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

నర్సంపేట : వామపక్ష సామాజిక ఉద్యమాలను బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు ఐక్యతను పెంపొందించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి కోరారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో కలకోట్ల యాదగిరి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి రవి హాజరై మాట్లాడారు. భారతదేశంలో మతోన్మాదం ప్రమాదం పెరిగిందని ఆందోళన వెలిబుచ్చారు. అట్టడుగు వర్గాలుగా ఉన్న సామాజిక తరగతులకు పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయకుండా పాలకులు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టే విధానాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఉచిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి హక్కులు, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడే ఉద్యమకారులను అణచి వేస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దోపిడీ విధానాలను నిరసిస్తూ సామాజిక అణచివేతలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు సామాజిక శక్తులు ఐక్యంగా ముందుకు కదిలి ప్రజాఉద్యమాలను నిర్మించేలా చొరవ చూపాలని సూచించారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు పార్టీ వ్యవస్థాపక నేత, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'వర్తమాన రాజకీయాలు–మార్క్సిజం, అంబేడ్కర్ ఆలోచన విధాన' అంశాన్ని చర్చనీయాంశం చేయాలని చెప్పారు. గ్రామస్థాయిలో కార్యక్రమాలకు ప్రారంభ సూచికగా ఈనెల 17న మచ్చాపురంలోని ఓంకార్ 150 ఫీట్ల స్తూపం వద్ద వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగెల్లి కొమురయ్య, కుసుంబ బాబురావు, వంగల రాగసుధ, జిల్లా నాయకులు మహ్మద్ రాజాసాహెబ్, కొత్తకొండ రాజమౌళి, కౌటి సదానందం, గాజుల వెంకటయ్య, అప్పనపురి నర్సయ్య, దామ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించండి

గూడూరు : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ మండల కేంద్రంలో 30పడకల ఆస్పత్రిగా పేరుగాంచిన సీహెచ్‌సీలో సరిపడా వైద్యులు, మందులు, టెస్టు కిట్లు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఈసం రామయ్య, కటకం బుచ్చిరాములు, గుండగాని సత్తయ్య, బండారి సత్యం పాల్గొన్నారు.

నరకాసుర వధకు ఏర్పాట్లు చేయాలి

ఖిలా వరంగల్ : ఈనెల 30న ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో నరకాసుర వధ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి కోరారు. జిల్లా కలెక్టర్ సత్యశారదను ఆయన కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమానికి సుమారు 50 వేల మంది హాజరవుతారని తెలిపారు. మైదానంలో విద్యుత్, ఆధునిక సౌండ్ సిస్టం, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, ఆవునూరి రామ్మూర్తి, వనం కుమార్, దూడ కొమురెల్లి, అన్న కుమారస్వామి, తొటం నర్సింహగౌడ్, రామ్ ఉన్నారు.

సొంతింటి కల.. ప్రభుత్వ ధ్యేయం

దామెర : రాష్ట్రంలోని పేదల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు బిల్లా రమణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్శెట్టి భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి రమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఇళ్లు లేని పేదలను గుర్తించి ఇళ్లను మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పోతుల విజయ, మేరుగు విజయ, కదం నగేష్, దామెర కట్టయ్య, అమ్ముల రవికుమార్‌ను సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులను సీనియర్ నాయకులు గంగిడి శ్రీధర్ రెడ్డి, సదిరం పోశాలు, పోతుల కొమ్మాలు, గడ్డం రమేశ్, మొద్దు ప్రవీణ్, పోతుల రాజకొమురు, సోనబోయిన రవి, లింగయ్య, దామెర రతన్, రజినీకర్, వంశీ తదితరులు అభినందించారు.